వైభవంగా ఎల్లమ్మ కల్యాణం

పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

ఆలయ పరిసరాలు కిటకిట











సనత్‌నగర్/అమీర్‌పేట్: ఆషాఢ మాసం మొదటి మంగళవారం జరిగే బల్కంపేట ఎల్లమ్మ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. నగరం నుంచే కాకుండా తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తుల తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. కల్యాణం రోజున వరుణుడు ఆశీర్వదించే సంప్రదాయం ఈసారి కూడా కొనసాగింది. గతానికి భిన్నంగా కల్యాణం టికెట్లు తక్కువగా జారీ చేయడంతో పాటు వీవీఐపీ, వీఐపీ పాస్‌లను సైతం తగ్గించడంతో సాధారణ క్యూలైన్లు త్వరగా కదిలాయి. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు కల్యాణాన్ని తిలకించారు. కల్యాణ మహోత్సవం ప్రశాంతంగా ముగియడంతో అటు పోలీసులు, ఇటు దేవాదాయ శాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

కల్యాణోత్సవం హైలెట్స్..

- కల్యాణం టికెట్లను 250 నుంచి 150 కి తగ్గించారు. దీంతో టికెట్ కొనుగోలుదారుల గ్యాలరీలో రద్దీ తగ్గింది.
- అలాగే వీఐపీ పాస్‌లు గతానికి భిన్నంగా 13 వేల వరకు జారీ చేయడంతో క్యూలైన్లలో అంతగా రద్దీ కనిపించలేదు. దీంతో పాస్‌లు లేనివారిని కూడా పోలీసులు ఆ లైన్లలో పంపించారు.
- గతంలో సాధారణ క్యూలైన్లలో కదలిక అంతగా ఉండేది కాదు. 3, 4 గంటల పాటు క్యూలైన్లలో వేచి ఉండే పరిస్థితి ఉండేది. ఈసారి 2 గంటల్లోపే దర్శనం చేసుకోవడం కనిపించింది.
- క్యూలైన్లలో చంటి బిడ్డలు, చిన్న పిల్లలతో వచ్చిన వారు కొంత ఇబ్బందులకు గురయ్యారు.
- వీఐపీ, కల్యాణం, డోనర్స్ గ్యాలరీలను వేర్వేరుగా ఏర్పాటుచేశారు. అయితే వీఐపీ గ్యాలరీలో ఈసారి ఎక్కువగా జోగినీలు ఆసీనులై కల్యాణాన్ని తిలకించడం కనిపించింది.
- ఆలయానికి వచ్చే రహదారులతో పాటు దేవాలయ చుట్టుపక్కల ప్రాంతాలను రాజకీయ నేతలు పెద్ద పెద్ద ఫ్లెక్సీలతో నింపేశారు.
- పలు సందర్భాల్లో బోర్డు సభ్యులను కూడా పోలీసులు అనుమతించలేదు. దీంతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఇదే క్రమంలో పోలీసులు ప్రభుత్వంలోని వివిధ శాఖల అధికారులు, వారి కుటుంబాలను నేరుగా పంపించడం కనిపించింది.
- కల్యాణ వేదిక వద్దకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మాత్రమే అనుమతించి మిగతా స్థానిక నాయకులను అనుమతించలేదు.
- ఈసారి కల్యాణోత్సవానికి వచ్చే భక్తులకు కల్లును అందజేశారు.
- ఎప్పటిలాగానే పలు అసోసియేషన్ల నాయకులు అన్నదాన, ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టాయి.
- వాటర్‌వర్క్స్ విభాగం అధికారులు క్యూలైన్లలో భక్తులకు తాగునీటి ప్యాకెట్లను అందజేశారు.


అమ్మవారి సన్నిధిలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి




దర్శనానికి క్యూలో భక్తులు


ఎమ్మెల్యే తలసానిని ఆశీర్వదిస్తున్న అర్చకుడు


అమ్మవారికి వస్త్రాలు సమర్పించిన జోగిని శ్యామల


అమ్మవారిని దర్శించుకున్న వెల్లాల రామ్మోహన్


భోజనాలు వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రసూన


మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి..


అమ్మవారి ఉత్సవమూర్తికి పూజలు చేసిన భక్తులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రసూల్‌పురా: సికింద్రాబాద్ డివిజనల్ ఠాగూర్ హోమ్స్, నెహ్రూనగర్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ సికింద్రాబాద్ కే. మురళీకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఠాగూర్ హోమ్స్, ఈస్ట్ నెహ్రూనగర్, అడ్డగుట్ట పెట్రోల్ పంప్ పరిసర ప్రాంతాలు. అలాగే మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నెహ్రూనగర్, కస్తూర్బా కాలేజీ, గీతారెడ్డి లేన్, సిరిపురం కాలనీ పరిసర ప్రాంతాలు.

ప్రత్యేక పూజలు

అడ్డగుట్ట: ఆషాఢ మాసం మొదటి మంగళవారాన్ని పురస్కరించుకుని తుకారాంగేట్‌లోని పహాడీ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే అభిషేకం, సింధూరం, ఆకుపూజ చేశారు. అనంతరం, వడమాల, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రోగి సహాయకుడి అదృశ్యం


రవి

గాంధీఆస్పత్రి: రోగి సహాయకుడు అదృశ్యమైన ఘటన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో జరిగింది. చిలకలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండలం గంగాపురానికి చెందిన సరస్వతి అనారోగ్యంతో గతనెల 25న గాంధీ ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్‌గా చేరింది. ఆమెకు తోడుగా సపర్యలు చేసేందుకు కుమారుడు పోతుల రవి (32) ఉంటున్నాడు. 30న సాయంత్రం 4.30 గంటలకు బయటకు వెళ్లిన రవి తిరిగి వార్డుకు రాలేదు. పలు ప్రాంతాల్లో గాలించిన ఫలితం లేకపోవడంతో సోదరుడు నరేందర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ ..


మౌనిక

బౌద్ధనగర్: మహిళ అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సునీత తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌నగర్ ప్రాంతానికి చెందిన పరమేష్, మౌనిక (31) భార్యాభర్తలు. వారం రోజులుగా వారి మధ్య గొడవలు జరుగుతుండడంతో మౌనిక ఇంట్లో ఎవరికీ చెప్పకుండా మంగళవారం ఇంటినుంచి వెళ్లిపోయింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో భర్త పరమేశ్ తెలిసిన వారి వద్ద వాకబు చేసిన, పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో పరమేశ్ వారాసిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శ్రీనివాస్

లాలాపేట: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని ఈస్ట్‌జోన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ ఆదేశాల మేరకు బేగంపేట్ టీటీఐ ఆధ్వర్యంలో ఓయూ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతన్నాయన్నారు. బేగంపేట్ టీటీఐ ఇన్‌స్పెక్టర్ అశోక్ రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు.18 ఏళ్ల లోపు వారు వాహనాలు నడిపితే చట్టరీత్యా నేరం అన్నారు. దీంతో పాటు సమాజంలో జరిగే నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యసనాలకు దూరంగా ఉండి బాగా చదివి తల్లిదండ్రులు, దేశానికి మంచి పేరు తేవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం జ్యోతి, చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, నల్లకుంట ట్రాఫిక్ ఎస్సై దేవదాసు, బేగంపేట టీటీఐ సిబ్బంది కృష్ణ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బన్సీలాల్‌పేట్: బీజేఆర్ బస్తీ కమిటీ ప్రతినిధి బృందం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మంగళవారం కలిసింది. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లింది. అలాగే బస్తీలోని అమ్మవారి ఆలయానికి కమాన్ నిర్మించాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బస్తీ నాయకులు ఎం. వెంకన్న, కె. లక్ష్మీపతి, బలరాం, నర్సింగ్‌రావు, అశోక్, సురేశ్, గోవర్ధన్, సాయిశివ, భరత్, రాజశేఖర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైద్యుల దినోత్సవం


బీసీ రాయ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గాంధీ పాలనా యంత్రాంగం


వైద్యురాలిని సత్కరిస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ, ఆస్పత్రుల్లో జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న డాక్టర్ బిదాస్ చంద్రారాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు వైద్యులకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సీహెచ్ఎస్ రాజకుమారి, డిప్యూటీ సూపరిండెంటెంట్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ రవి శేఖరరావు, ఆర్ఎంఓ-1 శేషాద్రి, అనస్తీషియా హెచ్ఓడీ ప్రొఫెసర్ మురళీధర్, ఆర్ఎంఓలు రజనీ, యోగేందర్, కల్యాణ చక్రవర్తి, మీనాక్షి, సరిత, బ్రహ్మేశ్వర్, నాజీమ్, నవీన్, జాహ్నవి, రాజేశ్వరీ, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఆస్పత్రిలో..

అడ్డగుట్ట: లాలాగూడ కేంద్రీయ రైల్వే ఆస్పత్రిలో ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమెన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 43 మంది వైద్యులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ముఖ్యఅతిథిగా దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మలా రాజారా, డాక్టర్ శివనాగ ప్రసాద్ హాజరై మాట్లాడుతూ.. రైల్వే ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జోనల్ కార్యదర్శి యుగంధర్, వైద్యులు శ్రీనివాస సత్యనారాయణ, సాయి, కృష్ణవేణి, వేదారణ్య, నారాయణ స్వామి, ఫెడరేషన్ ప్రతినిధులు సుధాకర్, కే.ఎస్. స్వామి, శివకుమార్ పాల్గొన్నారు.

తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్‌లో..

లాలాపేట: తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్లో అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్. పి. మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఓయూ మాజీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్. టి. తిరుపతిరావు ముఖ్య అతిథిగా హాజరై 15 మంది వైద్యులకు మొక్కలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఓం ప్రకాశ్, డా. టి వి రావు, జలంధర్‌రెడ్డి, డా. రామేశ్వర్‌రావు, హరిలరి, ధనలక్ష్మి, సంధ్య తదితరులు ఉన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.28, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 55, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 23, క్యాప్సికం 61, పచ్చకాకర 45, పందిరి బీర 38, క్యాబేజీ 18, క్యారెట్ 35, దొండ 35, గుండుబీన్స్ 75, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 28, దోసకాయ 18, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 24, చామగడ్డ 31, మొరంగడ్డ 23, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 5-6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

ఇండియన్ క్రిస్టియన్ డేను ఘనంగా జరుపుకోవాలి

రాంగోపాల్‌పేట్: ఈనెల 3న ఇండియన్ క్రిస్టియన్ డే ను క్రైస్తవులందరూ ఘనంగా జరుపుకోవాలని పలు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. సికింద్రాబాద్‌లోని క్రిస్టియన్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్యామ్యూల్ దేవర్‌రాజ్, ఫాదర్ అలెక్స్, ఫాదర్ రాజా, రాబర్ట్ సూర్యప్రకాశ్, బిషప్ ముల్కల భాస్కర్ తదితరులు మాట్లాడారు. ఏసుక్రీస్తు శిష్యులైన 12 మందిలో తోమా అనే శిష్యుడు 52వ శతాబ్దంలో భారత దేశానికి వచ్చి తమిళనాడులో సెయింట్ థామస్ చర్చిని ప్రారంభించారన్నారు. ఈనెల 3న ఆయన వర్ధంతి సందర్భంగా అన్ని సంఘాలకు చెందిన ప్రతినిధులు ఇండియన్ క్రిస్టియన్ డే గా ఆచరించాలని వారు కోరారు.

ఎస్‌బీఐలో ఉచిత వైద్య శిబిరం

సనత్‌నగర్: ఎస్‌బీఐ ఫౌండేషన్ డే సందర్భంగా జెకెకాలనీలోని ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ మహిత ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆస్పత్రి వైద్యులు ఉద్యోగులకు బీపీ, షుగర్‌తో పాటు సిరం, క్రియాటిన్ లెవల్స్, యూరిన్, ప్రోటీన్ తదితర పరీక్షల నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.


సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కల్యాణం..కమనీయం

రసూల్‌పురా: కంటోన్మెంట్ ఈద్గా అంబేద్కర్‌నగర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయ ఆధ్వర్యంలో అమ్మవారి కల్యాణాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ మహోత్సవంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు దాల్‌రాజు, ఇల్లందుల శంకర్, చంటి. సంతోష్, సన్నీ, సాబేర్, వీరేశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అన్నానగర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో

అన్నానగర్ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి కల్యాణంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు కుమారస్వామి గౌడ్, శ్రీశైలం గౌడ్, రాజు గౌడ్, రవికుమార్ గౌడ్, రాంచందర్ గౌడ్, పీసీసీ కార్యదర్శి రాజేశ్ యాదవ్, స్థానిక నాయకులు మహేశ్, నాగరాజు, మురళి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రేణుకాఎల్లమ్మ ఆలయంలో..

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోలక్‌పూర్ మేకలమండి సమీపంలోని రేణుకాఎల్లమ్మ ఆలయంలో కల్యాణాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరు కాగా వేద పండితులు ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మేకల విజయ్, ప్రధాన కార్యదర్శి గజ్జెల శ్రీనివాస్ స్థానిక నాయకులు వెంకటేషన్‌రాజు, లక్ష్మీపతి, ప్రేమ్‌కుమార్, వెంకట్ ముదిరాజ్, శాంతికుమార్, రంజిత్, సునంద తదితరులు పాల్గొన్నారు.


అన్నానగర్ ఆలయంలో ఎమ్మెల్యే శ్రీగణేశ్


కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్

విద్యార్థి సంఘాల నాయకుల ముందస్తు అరెస్టు



ఉస్మానియా యూనివర్సిటీ: పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయం ఎదుట ఐక్య విద్యార్థి సంఘాల ధర్నాను పురస్కరించుకుని ఓయూలో పలువురు విద్యార్థి నాయకులను మంగళవారం ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. క్యాంపస్‌లోని వివిధ హాస్టల్స్‌లో ఉంటున్న టీఎస్ఏ అధ్యక్షుడు ఎన్ఎం శ్రీకాంత్ యాదవ్, అంసా ఓయూ అధ్యక్షుడు నామ సైదులు, టీడీఎస్ఎఫ్ అధ్యక్షుడు విజయ్‌నాయక్, బీసీ నేత సంగం లింగయ్య యాదవ్, పీడీఎస్‌యూ నేత మందా నవీన్, టీఎస్‌పీ నేత మధు యాదవ్‌ను అరెస్ట్ చేసి నల్లకుంట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇదిలాఉంటే ఐక్య విద్యార్థి సంఘాల నేతల అరెస్టులను బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తీవ్రంగా ఖండించారు.

మర్యాదపూర్వక కలయిక



బౌద్ధనగర్: రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్‌రావును తార్నాకాలోని ఆయన నివాసంలో పార్టీ నగర మాజీ అధ్యక్షుడు వెంకటరమణ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

చైన్ అపహరించిన వ్యక్తి అరెస్టు

రాంగోపాల్‌పేట్: ప్రయాణికుడి మెడలోని బంగారు గొలుసు దొంగిలించిన కేసులో నిందితుడిని గోపాలపురం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి 12 గ్రాముల గొలుసును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేపల్లి మాంగారాబస్తీకి చెందిన చెందిన సునీల్ (29), అరుణ్‌కుమార్ పాత నేరస్తులు. ఇద్దరు కలిసి రద్దీగా ఉండే ఆర్టీసీ బస్సులను టార్గెట్ చేసుకుని అందులోని ప్రయాణికుల మెడలోని, బ్యాగుల్లోని బంగారు నగలు తస్కరిస్తున్నారు. గత నెల 30న వనస్థలిపురానికి చెందిన నాగవెంకట విజయకృష్ణ సికింద్రాబాద్‌లో ఓ శుభ కార్యానికి వచ్చారు. తిరిగి ఇంటికి వెళ్లేందుకు మదర్ థెరిస్సా విగ్రహం వద్దకు చేరుకుని ఉప్పల్ బస్టాప్‌లో బస్సు ఎక్కాడు. కొద్ది సేపటి తర్వాత గమనించగా మెడలోని బంగారు గొలుసు కనిపించలేదు. దీంతో ఆయన గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడు సునీల్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం చెప్పాడు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు.